క్లుప్తంగా

వాహనాలతో కిక్కిరిసిన శ్రీశైలం రహదారి



మన్ననూర్: కార్తీకమాసం పర్వదినాలు కావడంతో శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునే భక్తుల వాహనాలతో శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి కిక్కిరిసింది. కార్తీకమాసం చివరి ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులతో వెళ్లే వాహనాలు బారులు తీరారు. ఈ క్రమంలో ప్రత్యేకించి ఇరుకుగా ఉన్న మన్ననూర్ గ్రామం ప్రధాన రహదారిలో పాదచారులు ఇటు అటు రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడ్డారు. భక్తులతో ఆర్టీసీ బస్సులు రద్దీగా మారాయి.

శివుని గుట్టపై ప్రత్యేక పూజలు

వెల్దండ: మండల కేంద్రంలోని శివునిగుట్టపై ఆదివారం శివలింగానికి అభిషేకం, హోమం నిర్వహించారు. అయ్యప్పస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్, మట్ట వెంకటయ్యగౌడు, స్వాములు తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన మంగి వంశీధర్‌రెడ్డి, సంకీర్తి దంపతులు రూ. 25వేలు, అలాగే కిరణ్‌రెడ్డి, శ్రీజరెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రసన్న, రాజేందర్‌కుమార్, సంధ్య, శ్రీనివాస్‌సైనీ, కార్తీక్, శిరీష భక్తులు రూ. 20వేలు అందించారు. దాతలను ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి సన్మానించారు.

మహాసభను విజయవంతం చేయాలి



కల్వకుర్తిరూరల్: అచ్చంపేటలో నిర్వహించనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పర్వతాలు కోరారు. ఆదివారం మండలం తాండ్రలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డికి మహాసభలకు సంబంధించిన కరపత్రాలను అందించారు. సీపీఎం చేస్తున్న ప్రజా పోరాటాలను వారు వివరించారు. ఆంజనేయులు, మల్లయ్య, పరశురాములు, బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యేరాక

చారకొండ/లింగాల: మండలంలో సోమవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ పర్యటిస్తారని ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని తుర్కలపల్లిలో అంగన్‌వాడీ భవనం, మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ అదనపు గదులు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అలాగే లింగాల మండలంలోని కేసీ తండా, శ్రీరంగాపూర్‌లో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనాలకు భూమి పూజతో పాటు ఎర్రపెంటలో నిర్మించిన ఐటీడీఏ మల్టీపర్పస్ భవనాన్ని ప్రారంభిస్తారని కాంగ్రెస్ లింగాల మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు.

తైక్వాండాలో విద్యార్థుల ప్రతిభ



దోమలపెంట: టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో ఈగలపెంటలో నిర్వహిస్తున్న తైక్వాండాలో డీఏవీ ఆంగ్ల పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు మూడు నెలలుగా శిక్షణ పొందుతున్నారు. ఆదివారం తైక్వాండో మాస్టర్ శోభన్‌బాబు గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించి భూగర్భ కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డి, ఎస్ఈ(సివిల్)రవీంద్రకుమార్, డీఈ(ఓఅండ్ఎం)శ్రీనివాసరెడ్డి గ్రీన్, బ్లూ, ఎల్లో గ్రేడింగ్ బెల్టులను విద్యార్థులను అందజేశారు. శిక్షకుడు సుభాష్, ఉపాధ్యాయులు వీరప్రసాద్, శ్రీనివాస్, జానయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా డొంకదారులు

- అవస్థలు పడుతున్న రైతులు



వెంకటేశ్వర్లబావి పంట పాలాలకు వెళ్లే డొంకదారి ఇలా..

అమ్రాబాద్: వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు డొంకదారులు సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డొంకదారులు ఎగుడు దిగుడుగా, రాళ్లు, చెట్లు నిండి ఉండటంతో పాటు కొన్ని పొలాలకు వెళ్లేందుకు వీలు లేని పరిస్థితి దాపురించింది. మండలంలోని తిర్మలాపూర్(బీకే), గ్రామ పడమర వైపు పొలాలకు వెళ్లేందుకు అసలు దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జంగంరెడ్డిపల్లిలో తూర్పు డొంక, నేరళ్లవాగు డొంకలు ఇరుకుగా ఉన్నాయి, పడమర పొలాలకు పోయేందుకు కూడా దారి నరకయాతన అనుభవిస్తున్నారు. కల్ములోనిపల్లిలో డొంక ఇరుకుగా ఉంది. కుమ్మరోనిపల్లిలో పొలాలకు వెళ్లేందుకు పెద్దవాగుపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా ధ్వంసమయ్యింది. వెంకటేశ్వర్లబావిలో పొలాలకు వెళ్లే డొంకదారి అధ్వానంగా తయారైంది. వర్షాల సమయంలో డొంక వెంటనే వాగు పారుతుంది. ఎమిరెడ్డిపల్లి డొంక ఇరుకుగా ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పక్కరైతుల చేన్లలో నుంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కుమ్మరోనిపల్లి నుంచి మాధవానిపల్లి వైపు ఉన్న డొంకదారి గోతులమయంగా మారింది. అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. ఫలితంగా రైతులు వ్యవసాయ పొలాలకు ఎరువులు తరలించేందుకు, పొలాల నుంచి పండించిన ధాన్యం, పశుగ్రాసం తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఒక్కో సారి ఎద్దుల బండ్లు బోల్తా పడి గాయాలకు గురవుతున్నారు. పై పొలాల రైతులు కింది పొలాల వారి చేన్ల వెంట వెళ్తున్నప్పుడు ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కనీసం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి/ హామీ పనులతో అయినా డొంకదారులు బాగు చేయించి రైతుల ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

గ్రామాలల్లో వ్యవసాయ పొలాలకు వెళ్లే డొంకదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో వివిధ పనుల కోసం పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు డొంకదారులను బాగు చేయించాలి.

– పెరుమయ్య, కల్ములోనిపల్లి

ఈజీఎస్ ద్వారా పనులు చేస్తాం

ఈజీఎస్ ద్వారా పనుల గుర్తించి పనులు ప్రారంభిస్తాం. డొంకదారులను బాగు కోసం కృషి చేస్తాం. రైతుల ఇబ్బందులను తొలగిస్తాం. నిధులు విడుదల అయిన వెంటనే పనులు చేపడుతాం.

– రఘుమూర్తి, ఈజీఎస్‌ఏపీఓ

సత్యసాయి ట్రస్టు సేవలు ఆదర్శం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: సత్యసాయి ట్రస్టు సేవలు ఆదర్శమని ఎమ్మెల్యే డా రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి స్థానిక సత్యసాయి మందిరంలో నిర్వహించిన సత్యసాయి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరు సేవాభావం కలిగి ఉండాలన్నారు. సత్యసాయిబాబా బోధనలు అనుసరణీయమన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందన్నారు. సత్యసాయి సేవా సంస్థ బాలవికాస్ విద్యార్థుల ప్రతిభను ఆయన మెచ్చుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు



కోడేరులో వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

కోడేరు: వరిధాన్యం కొనుగోలు కోసం దళారులను ఆశ్రయించొద్దని ఆర్డీఓ బన్సీలాల్ పేర్కొన్నారు. ఆదివారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మాలని సూచించారు. కేంద్రాల వద్ద విద్యుత్, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. అనంతరం ఓటరు నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, సిబ్బంది సురేందర్, జమ్ములయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే వివరాల నమోదు

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని ఆపరేటర్లు జాగ్రత్తగా చేపట్టాలని కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్ అన్నారు. ఆదివారం పెద్దకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేటర్లు, ఎన్యూమరేటర్లు సర్వేలో బుక్‌లో పొందుపర్చిన నంబర్లను జాగ్రత్తగా కంప్యూటర్‌లో నమోదు చేయాలన్నారు. తప్పులు లేకుండా చూడాలని తహసీల్దార్ మోహన్, ఎంపీడీఓ నాగేందర్‌కు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగేషులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పరిశీలించిన ఆర్డీఓ

తిమ్మాజిపేట: మండలంలోని మరికల్, తిమ్మాజిపేట గ్రామాల్లో ఆదివారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని నాగర్‌కర్నూల్ ఆర్డీఓ సురేష్ పరిశీలించారు. ఈ నెల 23, 24తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఓటరు నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 20 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రామకృష్ణయ్య తెలిపారు. ఆర్డీఓ వెంట ఆర్ఐ రవిచంద్ర, జూనియర్ అసిస్టెంట్లు, ఆయా గ్రామాల బీఎల్ఓలు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సాతాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం సాతాపూర్, జొన్నలబొగుడ, చంద్రకల్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మి రైతులు రశీదులు పొందాలని కోరారు. ప్రభుత్వం సన్నరకం వడ్లు కొనుగోలు చేసిన రైతులకు రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అరుణ, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు దండు నర్సింహ, ఎల్లయ్య, చంద్రయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్‌రావు, శివకుమార్‌రావు, బద్దెనాయక్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూస్తాం



అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం బీఆర్ అంబేడ్కర్ ప్రజాభవన్‌లో మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి ప్రతి ఇంటికి సరఫరా అయ్యే విధంగా చూడాలని కోరారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. లీకేజీలు, పైప్‌లైన్ మరమ్మతు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పట్టణంలో పైపులైన్ ప్రాంతాలకు కొత్త లైన్లు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏమైన ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

అమ్రాబాద్: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని ఈదులబావిలో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక పాఠశాల ప్రహరీ పనులు, అదేవిధంగా గ్రామంలో రూ.4 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వివిధ కారణాలతో మృతి చెందిన ఈదులబావి, అమ్రాబాద్ బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సందర్శించి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆరుగ్యారంటీలు ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ వెంకటయ్య, మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్, నాయకులు మల్లికార్జున్, సంతోష్, బాలింగంగౌడ్ తదితరులు ఉన్నారు.

హామీలను అమలు చేయాలి



కోడేరు: ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి నర్సింహ్మ అన్నారు. మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామసభలు ఏర్పాటు చేసి అర్హులకు ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. అదే విధంగా రేషన్ షాపుల ద్వారా కేరళ ప్రభుత్వం తరహాలో 16 రకాల సరుకులు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపడుతునట్లు వివరించారు. కార్యక్రమంలో రవి, శంకర్, వరప్రసాద్, వెంకటమ్మ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఆవు మృతి

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన షాంపూరి కృష్ణయ్యకు సంబంధించిన పాడి ఆవు ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. వ్యవసాయ పొలంలో ఆవు మేతమేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌ను తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ దాదాపుగా రూ.80 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఘటన స్థలాన్ని అధికారులు పరిశీలించారు.

మైలారంవాసికి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు



కోడేరు: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన నర్సింహస్వామి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై అందరికి ఆదర్శంగా నిలిచాడు. గురుకుల పాఠశాలలో టీజీటీ ఇంగ్లీష్, పీజీటీ ఇంగ్లీష్, జేఎల్ ఇంగ్లీష్‌తో పాటు పీజీటీ సోషల్‌లో నాలుగు ఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం మహాత్మజ్యోతిరావుపూలే జూనియర్ కళాశాలలో చిట్యాల వనపర్తిలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు.

మాదిగ ఉద్యోగులకు సన్మానం

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన మాదిగ ఉద్యోగులను మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో సన్మానించారు. ఉపాధ్యాయులుగా నియమితులైన 30 మంది మాదిగ అభ్యర్థులతోపాటు మరి కొంత మంది వివిధ డిపార్ట్‌మెంట్‌లలో ఉద్యోగాలు పొందినవారిని ఎంఈఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా కృష్ణతోపాటు కోళ్లశివలు మెమెంటోలతో సత్కరించారు.

ఏడు అడుగుల పాము పట్టివేత



తాడూరు: మండల కేంద్రంలోని 2, 3 వార్డులలో తరచూ పాములు తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. 15 రోజుల నుంచి వార్డులలోని చుట్టుప్రక్కల పాములు సంచరిస్తున్నాయి. పాములను చూసి స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం దాదాపు 7 అడుగుల జెర్రి పామును పట్టుకున్నారు. అధికారులు పాములు పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

కోడేరువాసికి డాక్టరేట్



కోడేరు: మండల కేంద్రానికి చెందిన ఎలగొండ్ల బాలయ్య అలివేల కుమారుడు రమేష్ న్యూఢిల్లీలో నిర్వహించిన గ్రాండ్ కాన్వోకేషన్ వేడుకలలో ఆదివారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ కౌన్సిల్ ఆఫ్ సైటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ డాక్టర్ కలైసెల్వీ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. పీహెచ్‌డీ పట్టా పొందడంపై గ్రామస్తులు అభినందించారు.

పేద మహిళ ఉపాధికి చేయూత



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మహిళ భాగ్యమ్మ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. విషయం తెలుసుకున్న భగత్ సింగ్ యూత్ ఓల్డ్‌సిటీ హైదరాబాద్‌కు చెందిన యువకులు సమకూర్చిన రూ.15 వేలతో పూలదుకాణాన్ని ఏర్పాటు చేసి ఉపాధి కల్పించారు. ఈ మేరకు ఆదివారం ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవహ ఆంజనేయులు దుకాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, శ్రీను, అరవింద్, సదానందం గౌడ్, దుర్గప్రసాద్, నర్సింహ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా



లింగాల: కాంగ్రెస్ పార్టీ విజయోత్సవాలలో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో కళాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని లింగాల, దారారం, సూరాపూర్ తదితర గ్రామాల్లో కళాజాతా బృందాలు పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. 6 గ్యారంటీల పథకాల అమలు గురించి ఆటపాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో కళాజాతా బృందం సభ్యులు భాస్కర్, జల్లి కృష్ణ, శివనాగులు, నరేందర్, శివయ్య, సికిందర్, పార్వతమ్మ, అస్మా, రేణుక, శైలజ పాల్గొన్నారు.

సింహగర్జనను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

పెంట్లవెల్లి: హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ కమిటీ నాయకుడు మూలె మేగారాజు అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 21న హైదరాబాద్‌లో నిర్వహించే సభకు తరలిరావాలని అయన కోరారు. అదేవిధంగా మాలలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఖండిస్తూ మాలలందరు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణకు వత్తాసు పలికిన రాజకీయ పార్టీలకు రాబోయే కాలంలో మనుగడ ఉండదని వారు హెచ్చరించారు. ప్రతి ఒక్కరం ఏకమైన ప్రతి పల్లె నుంచి ఇంటికి ఒకరు బయటకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీపీ రావు, గోవు రాజు, తైలం శ్రీనివాస్, వెంకటేష్, సుధాకర్, కొండల్, చెన్నకేశవులు, రామకృష్ణ, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

అచ్చంపేట రూరల్: ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ డివిజన్ అధ్యక్షుడు పాత్కుల శ్రీశైలం డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1 నిర్వహించే మాలల సింహగర్జన బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకుంటూ రిజర్వేషన్లను కాపాడుకుందామన్నారు. బహిరంగ సభకు అచ్చంపేట నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మహానాడు అధ్యక్షుడు బాలస్వామి, ఆనంద్, మల్లికార్జున్, ప్రభాకర్, శ్రీనివాసులు, అనీల్, కేశవులు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



లింగాల: మండలంలోని ఎర్రపెంట చెంచులకు ఆదివారం నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పూర్ణచందర్ రావు మాట్లాడుతూ ఎర్రపెంటను దత్తత తీసుకొని చెంచుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పెంటలో కనీస సౌకర్యాల కల్పనకు ఫౌండేషన్ కృషి చేస్తుందని అన్నారు. తాగునీటి కోసం రూ.2 లక్షలు విలువ చేసే స్టీల్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చెంచులతో కలిసి కార్తీక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో శ్రీపతిరెడ్డి, పెంటకు చెందిన చెంచులు పాల్గొన్నారు.